ప్రజాశక్తి
బుధవారం 14 జూన్ 2023 5
శ్రీకాకుళం

ఇంటర్‌లో 80.19 శాతం ఉత్తీర్ణత

- ప్రథమ సంవత్సరంలో 70.55 శాతం పాస్
- వెలువడిన సప్లిమెంటరీ ఫలితాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 80.19 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు మొత్తం 21,061మంది విద్యార్థులు హాజరు కాగా 16,889 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి పరీక్షలకు హాజరైన 21,607 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో 15,243 మంది (70.55 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ పరీక్షలను 783 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రాయగా, వారిలో 429 మంది (54.79 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ పరీక్షలకు 965 మంది విద్యార్థులు హాజరు కాగా 492 మంది పాస్ అయ్యారు. పరీక్షలు మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించారు.

సాగుకు సన్నద్ధత

నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో జిల్లాకు విస్తరిస్తాయన్న వార్తలతో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. వర్షాలు కురిస్తే నారుమడులను సిద్ధం చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. మరోవైపు ప్రయివేట్ వ్యాపారులూ విత్తనాల విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఏటా 33 శాతం రాయితీపై వరి విత్తనాలు సమకూర్చుతోంది. ఈసారి ఉత్తరాంధ్ర జిల్లాలకు వరి విత్తనాలపై 46 శాతం సబ్సిడీ ఇస్తోంది. ఈ ఏడాది రాయితీ శాతం పెరగడంతో విత్తనాలకు డిమాండ్ పెరగనుంది.

- 3.99 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 24,285 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- విత్తనాలపై రాయితీ 33 నుంచి 46 శాతానికి పెంపు
- నారుమళ్లకు అన్నదాతల సమాయత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల్లో వేసేలా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో 3,98,750 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు తదితర తృణ ధాన్యాలు 26,685 ఎకరాల్లో సాగు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. వీటిలో సజ్జలు 165 ఎకరాలు, మొక్కజొన్న 26,375 ఎకరాలు, రాగులు 145 ఎకరాల్లో వేయనున్నారు. ఈ సీజన్‌లో 860 ఎకరాల్లో పప్పుధాన్యాలు సాగు లక్ష్యంగా నిర్దేశించారు. వీటిలో కందులు 335 ఎకరాలు, పెసలు 252.5 ఎకరాలు, మినుములు 272.5 ఎకరాల్లో వేయనున్నారు. నూనెగింజలు 1430 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

వీటిలో వేరుశనగ 1332.5 ఎకరాలు, నువ్వులు 97.5 ఎకరాల్లో సాగు చేయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తి 4,620 ఎకరాలు, గోగు పంట 257.5 ఎకరాలు, చెరుకు 4,550 ఎకరాల్లో వేయనున్నారు. మిరప పది ఎకరాలు, ఉల్లి 2.5 ఎకరాలు, పసుపు 60 ఎకరాల్లో సాగు చేయనున్నారు.

1.38 లక్షల్లో ఇతర పంటలు

కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కలిపి ఈ సంవత్సరం 1,38,240 ఎకరాల్లో సాగు చేయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో టమోటా 250 ఎకరాలు, కూరగాయలు 1862.5 ఎకరాలు, ఇతర పశుగ్రాస పంటలు 75 ఎకరాల్లో వేయనున్నారు. ఇవికాకుండా కొబ్బరి, టేకు తదితర పంటలు 1,36,052.5 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు భావిస్తున్నారు.

35,040 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్నిరకాల విత్తనాలు 35,040 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం 24,285 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో ఈ ఏడాది ఎంటియు 1061 రకం సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈరకం విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ 9,787 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. అదేవిధంగా స్వర్ణ రకం విత్తనాలు 7,433 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.

విత్తనాల పంపిణీ మొదలు పెట్టాం

ఉత్తరాంధ్ర జిల్లాలకు వరి విత్తనాలపై సబ్సిడీని ప్రభుత్వం 33 నుంచి 46 శాతానికి పెంచింది. జిల్లాకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రైతులకు ఐదు వేల క్వింటాళ్ల విత్తనాలను అందించాం. ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ఈసారి ఎరువులను అందించనున్నాం.

- కె.శ్రీధర్,
వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న గ్రేవ్, పోక్సో, అట్రాసిటీ వంటి తీవ్రమైన కేసులను సమగ్ర దర్యాప్తుతో పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రేవ్, పోక్సో, అత్యాచార తదితర కేసుల దర్యాప్తు, రోడ్డు ప్రమాదాలు, సిసి కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. దర్యాప్తులో వెల్లడైన అంశాలు, సాక్ష్యాధారాల బట్టి కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలని సూచించారు. హత్య, అత్యాచార, పోక్సో కేసుల దర్యాప్తులో జాగ్రత్తలు పాటించాలన్నారు. నేర నివారణకు సబ్ డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని చెప్పారు. నేరాల నివారణ, నేరస్తులను గుర్తించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, ఆలయాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా, గస్తీ పెంచాలన్నారు. రహదారులపై జరిగే నేరాలను నియంత్రించడానికి హైవే మొబైల్ నిరంతర గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనర్థాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించే విధంగా జిల్లావ్యాప్తంగా కళాశాలల వద్ద హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు నాగేశ్వరరెడ్డి, డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, ఎస్.బాలరాజు, ఎస్.వాసుదేవ్, సిఐలు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న మీనాక్షి

నెలవారీ నివేదికలు తప్పనిసరి

- నోటిఫైడ్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో మలేరియా, డెంగీ, టిబి, టైఫాయిడ్, చికెన్‌గున్యా, రేబిస్ తదితర వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలను ప్రతినెలా తప్పనిసరిగా వైద్యారోగ్యశాఖకు నివేదించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఆదేశించారు. నగరంలోని కిమ్స్, మెడికవర్ ఆస్పత్రులను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో రోజువారీ నమోదు చేస్తున్న ప్రక్రియను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపు పొందిన వ్యాధులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో వ్యాధిగ్రస్తుల వివరాలను ప్రతిరోజూ తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రతినెలా ప్రభుత్వం నిర్దేశించిన పట్టిక ద్వారా రోగుల వివరాలను సమర్పించాలని స్పష్టం చేశారు. రోగుల వివరాలు సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయని, వివరాలు సమర్పించని ఆస్పత్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మెడికవర్ సెంట్రల్ హెడ్ డా.పి.సాగరిక, ఆపరేషనల్ మేనేజర్ జి.శివసురేంద్ర, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు సిహెచ్.కృష్ణమోహన్, సాయి, పి.శ్రీధర్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - బూర్జ

ఆదివాసీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మండలంలోని పెద్దపేటలో గల ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి రైతు ఉత్పత్తిదారుల కంపెనీల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు వస్తు విలువ ఆధారిత కార్యక్రమాలు చేపడితే, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో పసుపు, పైనాపిల్‌ను పండించడం వల్ల అధిక దిగుబడులతో లాభాలు వస్తాయన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో రెండు కోల్డ్‌రూమ్‌లు ఉన్నాయని, వాటిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. నాబార్డు డిడిఎం కుప్పిలి వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకొచ్చి, వారికి అదనపు ఆదాయం సమకూరేలా నాబార్డు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఆర్ఫ్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఆర్ఫ్ సంస్థ ఆదివాసీ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆర్ఫ్ సంస్థ లోగో, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాటు చేసిన విలువ ఆధారిత వస్తువుల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.ఎస్ నీలవేని, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి రాజగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఫ్ సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

26న ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ధర్నా

- శివారు భూములకు నీరందించాలి
- వంశధార, నారాయణపురం కాలువల మరమ్మతులు చేయాలి
- రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వంశధార, నారాయణపురం సాగునీటి కాలువల మరమ్మతులు చేయించి శివారు భూములకూ నీరందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న ఇరిగేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు వెల్లడించారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 20 ఏళ్లుగా వంశధార కాలువలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల వజ్రపుకొత్తూరు మండలంలోని 25 గ్రామాల్లో శివారు భూములకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2009లో షట్టర్లు బిగించాలని నిర్ణయించినా, నేటికీ బిగించకపోవడంతో నీరు వృథాగా పోతోందని తెలిపారు. రైతులు కాలువలకు ఇసుక బస్తాలను అడ్డు పెట్టుకుని నీరు పెట్టుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం, రైతులకు ఎందుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడం లేదని ప్రశ్నించారు. జిల్లా మంత్రులు దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. నారాయణపురం కాలువలను ఆధునీకరిస్తామన్న ప్రకటనలు తప్ప పనులు చేయకపోవడంతో, ఎచ్చెర్ల మండలం చివర గ్రామాలైన తోటపాలెం, కొంగరాం, ముద్దాడ, రామజోగిపేట, భగీరథపురం, తదితర గ్రామాలకు సాగునీరందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వర్షాకాలం వస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదని విమర్శించారు. ఇచ్ఛాపురం మండలంలోని ఓపెన్‌హెడ్ ఛానళ్లు, సోంపేటలో పైడిగాం ఛానల్, పొత్తంగి, బారువ గ్రోయినట్లు దశాబ్దాలుగా మరమ్మతులకు నోసుకోవడం లేదని చెప్పారు. మందస సునామిది ఛానల్, దామోదరసాగరం, కళింగదళ్, దబార్సింగి తదితర కాలువలను మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే కాలువల మరమ్మతు పనులు చేపట్టలని, అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. ముందుగా చివర ప్రాంతాల చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పొందూరు చందరరావు, ఉంకిలి రాజేశ్వరరావు, గొల్లపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

లాభాల బాటలో డిసిసిబి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డిసిసిబి లాభాల బాటలో నడుస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) ప్రధాన కార్యాలయం రెండో అంతస్థుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు తోడ్పాటు అందించడంలో డిసిసిబి పాత్ర కీలకమన్నారు. బ్యాంకు రుణాల మంజూరు పారదర్శకంగా జరగాలని సూచించారు. సంస్థలో చేరిన వారిని నష్టపోకుండా చూడాలని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రయివేటు బ్యాంకులతో పోటీ పడాలని సూచించారు. సహకార బ్యాంకులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆప్కాబ్ సాధించిన విజయాలను కొనియాడారు. డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక రూ.2,100 కోట్ల వార్షిక టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. డిసిసిబి ద్వారా పలు వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలను బ్యాంకు ద్వారా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

డిసిసిబి మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 25 బ్రాంచ్‌లకు అదనంగా మరో 11 బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వర్క్‌షాపు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆప్కాబ్ ఎమ్‌డి శ్రీనాథ్ రెడ్డి, అధ్యక్షులు ఝాన్సీరాణి మాట్లాడుతూ సహకార బ్యాంకులో తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించే పంటలకు గొడౌన్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. అనంతరం 87వ వార్షిక నివేదిక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రూ.5.30 కోట్ల చెక్కును సొసైటీలకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్పొరేషన్ల అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, డిసిఎంఎస్ అధ్యక్షులు చల్లా సుగుణ, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, పాలకవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, డిజిఎంలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సమర్థవంతంగా పనిచేయాలి

మెళియాపుట్టి : కీలక శాఖల్లో రెవెన్యూ శాఖ ఒకటని, ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కలెక్టర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజా సేవకులు అని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రెండేళ్లలో పది నూతన తహశీల్దార్ కార్యాలయ భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ, పి.చంద్రకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు జి.ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్, పిఎసిఎస్ అధ్యక్షులు యు.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాపరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నలుగురు ఉద్యోగుల కుటుంబసభ్యులకు సాంఘిక భద్రతా పథకం కింద కారుణ్య నియామకాలు చేపట్టారు. జెడ్‌పి కార్యాలయంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం నియామకపు పత్రాలను అందజేశారు. మదనాల అరవింద్‌ను సోంపేట మండలం మామిడిపల్లి జెడ్‌పి హైస్కూల్లో నియమించారు. నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో దుంగ రామరత్నం, జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎ.ఝాన్సీలక్ష్మి, పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో యజ్జల పూజిత ఆఫీస్ సబార్డినేట్లుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

బూర్జ : జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వం తాగునీటిని అందిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వుప్పపేటలో సుమారు రూ.23.50 లక్షలతో, ఉప్పివలసలో సుమారు రూ.45 లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల కార్యక్రమానికి మంగళవారం స్పీకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను చూసి, గ్రామాల్లో నీటి కొరత లేకుండా ప్రతి గడపకు తాగునీరందించాలని లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, సర్పంచ్‌లు గొలివి మంజుల, కె.అనిత్ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత పాలనతో సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వ నిష్పక్షపాత పాలనతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమైందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి సంక్షేమ పథకాల అమలే కారణమని స్పష్టం చేశారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలోనే నెరవేర్చినట్లు తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు అందాలంటే లంచాలు ఇవ్వాలని, మధ్యవర్తులకు ముట్టజెప్పనిదే పనులు పూర్తయిన దాఖలాల్లేవన్నారు. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమవుతున్నాయని తెలిపారు. గతంలో చిన్న పనికీ మండల, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, రోజుల తరబడి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసేవారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల రాకతో ఉన్న ఊర్లోనే పనులు పూర్తవుతున్నాయని తెలిపారు.

పాఠశాల తెరిచిన మొదటి రోజునే జగనన్న విద్యా కానుక పేరిట పిల్లలకు బుక్స్, యూనిఫాం, బెల్ట్, షూ ఇలా తొమ్మిది వస్తువులతో కూడిన కిట్ ఇచ్చామన్నారు. పదవి ఉన్నా లేకున్నా, గెలిచినా ఓడినా ప్రజలతోనే ఉంటానన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెంటాడ స్వరూప్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ అలివేలుమంగ, వార్డు ఇన్‌ఛార్జి నక్క రామరాజు, మండవల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA 1077/2019 IN OS 240/2010
BETWEEN:
RAVADA RAJULU .... PETITIONER
AND
NETHINTI CHINNAMMADU AND OTHERS ....RESPONDENTS
Respondent No.4
Yela Rama Rao@Nethinti Rama Rao
S/o Chinnodu, Age 60 years, Ex-Serviceman residing at Kunukupeta Street, Dharmavaram Village, Etcherla Mandalam, Srikakulam Dist.
NOTICE
పై నెంబరు ఫైనల్ డిక్రీలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు ఫైనల్ డిక్రీలో మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నా, స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని తేది 28-06-2023 దిన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరని యిందుమూలంగా తెలియజేయడమైనది.
Baratam Srinivas Satyanarayana
Advocate, Srikakulam

గ్రామ సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న జస్టిస్ వెంకటరమణ

హైకోర్టు జడ్జికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- పొందూరు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మంగళవారం స్వగ్రామమైన మండలంలోని చినబొడ్డేపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకాకుళం ఫస్టు బడిఎం కె.రాణి, సర్పంచ్ బి.రమణ, మాజీ సర్పంచ్ బి.సత్యం, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని అసిరితల్లి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామ సమస్యలపై చర్చించారు. అసిరితల్లి ఆలయానికి రహదారి నిర్మాణంతో పాటు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలంటూ సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన్ను శ్రీకాకుళం ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేష్, న్యాయవాదులు, అధికారులు కలిశారు.

రూ.5.70 కోట్లతో కోర్టు భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ భవనం, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణానికి అధికారులు రూ.5.70 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ తెలిపారు. అలాగే పాలకొండ కోర్టు భవనం, నివాస సముదాయాల నిర్మాణానికీ రూ.4 కోట్లతో ప్రతిపాధనలు పంపించారని, ఈ రెండింటి మధ్య తేడాపై అధికారుల వివరణ కోరామని అన్నారు. పొందూరు కోర్టు భవనం నిర్మాణ ప్రాంతం రాతితో కూడినది కావడంతో డ్రిల్లింగ్ నిర్వహించి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని అధికారులు తెలిపారని పేర్కొన్నారు. దీనిపై సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

వైద్య శిబిరానికి స్పందన

ఎచ్చెర్ల: మండలంలోని డి.మత్స్యలేశంలో పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ బి.అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 200 మందికి కిడ్నీ వ్యాధిగ్రస్తులు, కలుషితనీరు వాడకం వల్ల వ్యాధుల బారిన పడిన వారితో పాటు సాధారణ రుగ్మతలుతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, కఫ పరీక్షలు డాక్టర్లు ఎన్.శేషగిరి, ఎం.దీప నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరానికి సర్పంచ్ మూగి ఈక్షిత, ఎంపిటిసి చోడిపల్లి వలసమ్మ, మండల కన్వీనర్ మూగి శ్రీరాములు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జగన్నాథరావు, పబ్లిక్ హెల్త్ నర్సు జి.సుధ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

నేడు ప్రపంచ రక్తదాన దినోత్సవం

ప్రజాశక్తి - రణస్థలం

ఒక్కమాటలో చెప్పాలంటే రక్తదానం.. ప్రాణదానం. ప్రపంచంలో ప్రతి 2 సెకన్లకు ఎవరో ఒకరు రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నట్లు వైద్యాధికారులు తరచూ చెబుతున్నారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్న వారి రక్తం ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుంది. రక్తదానం చేసేందుకు ప్రజల్ని చైతన్యవంతులను చేసి ప్రజలకు దాని గురించి సరైన అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ 2005 నుంచి జూన్ 14న ఏటా ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంది. రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. మీరిచ్చే ఒక్క యూనిట్ రక్తం (300-450 మి.లీ) ముగ్గురికి పునర్జన్మనిస్తుంది.

రక్తదానం ఎవరు చేయాలి

18-60 సంవత్సరాల లోపు ఉండి ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చు. సగటు బరువు 45 కేజీల కంటే ఎక్కువ ఉండి, రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండాలి.
మత్తు పదార్థాలకు బానిసైనవారు, హెపటైటిస్ బి, సి, హెచ్‌ఐవి, బిపి ఉన్న వారు రక్తదానానికి అనర్హులు.
ఒకసారి రక్తం ఇచ్చిన వారు మహిళలైతే 6 నెలలు, మగవారైతే 3 నెలల తర్వాత రెండో సారి ఇవ్వవచ్చు. అంతేకాకుండా గడిచిన 6 నెలల్లో రక్తం ఎక్కించుకున్న వారు రక్తదానానికి అనర్హులు.

ప్రయోజనాలు

- రక్తదానం చేసే ముందు చేసే వైద్య పరీక్షల ద్వారా మీరు ఆరోగ్యంగా ఉన్నారో లేదో తెలుసుకోవచ్చు.
- రక్తదానం చేయడంతోకేన్సర్ రిస్కును తగ్గించుకోవచ్చు.
- పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు కేన్సర్లు రాకుండా కాపాడుకోవచ్చు.
- గుండె సంబంధిత వ్యాధులను నివారించడానికి రక్తదానం చేయడం మంచిది.
- రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.
- సంవత్సరానికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ను తగ్గించుకోవచ్చు.
- రక్తదానం సన్నగా ఉన్నవారు చేయకూడదు, లావుగా ఉన్నవారే చేయాలనేవన్నీ అపోహలు మాత్రమే. రక్తదానం చేస్తే బలహీనపడిపోవడం, హెచ్ఐవి సోకడం, రక్తహీనత రావడం అనే వాదన కూడా సరికాదు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరుకుందాం..

రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

రక్తదానం చేసే 3 గంటల ముందు భోజనం చేయాలి. రక్తదానం చేయడానికి 48 గంటల ముందు ధూమపానం, మద్యపానం వంటివి చేయకూడదు.

39సార్లు రక్తదానం చేశా

నేను 39 సార్లు రక్తదానం చేశాను. రక్తదానంపై అపోహలు విడనాడి ఏడాదిలో మూడుసార్లు రక్తదానం చేయవచ్చు.. రక్తదానం చేయడం వల్ల మంచి ఆరోగ్యంగా ఉంటాం. రణస్థలం మండల కేంద్రంలో శ్రీఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 70 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించాం. సుమారు ఆరు వేల యూనిట్లు రక్తాన్ని సేకరించి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లా కేంద్రాల్లోని బ్లడ్ బ్యాంకులకు రక్తాన్ని అందించి ఆదుకున్నాం.

- ఇడదాసుల తిరుపతిరాజు, ఫౌండేషన్ అధ్యక్షులు, రణస్థలం

సమగ్ర నీటి ప్రాజెక్టు పనులు పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో ఎఐఐబి తాగునీటి ప్రాజెక్టు పనులను చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ హరి శ్రీనివాసరావు, ఇఇ సుగుణకరావులు కలిసి మంగళవారం పరిశీలించారు. పురపాలక సంఘంలో బాహుదా నదిలో చేపడుతున్న ఊట బావులనూ పరిశీలించారు. ఈ మేరకు చైర్‌పర్సన్ నీటి ప్రాజెక్టు పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఎస్ఇ, ఇఇ మాట్లాడుతూ ఇచ్ఛాపురం పరిధిలో మూడు ఊట బావులు నిర్మిస్తున్నామని, రోడ్డు మట్టానికి 30 అడుగుల లోతులో పనులు చేపడుతున్నామని అన్నారు. ఊట బావులకు స్వచ్ఛమైన నీరు మళ్లించేందుకు అనేక పొరల్లో రాళ్లు, ఇసుక, మట్టి వంటి మెటీరియల్ వేసి కప్పుతున్నామని తెలిపారు. ఊట బావుల నిర్మాణం పూర్తయితే... మిగతా పనులు వేగవంతమవుతాయని అన్నారు. ఇప్పటికే ఊట బావులకు సంబంధించి సగం పనులు పూర్తయ్యాయని అన్నారు. మరో 15 రోజుల్లో ఇక్కడి పనులు పూర్తి చేస్తామన్నారు. నదిలో నీరు ఉన్నప్పుడు పనులకు ఆటంకం కలగకుండా నదిలో నీటిని మళ్లించి ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. నీటిని పంపింగ్ చేయడానికి పురుషోత్తపురం, రత్తకన్న, బెల్లుపడలో రిజర్వాయర్లను నిర్మించాల్సి ఉందన్నారు. పురుషోత్తపురం వైపు 2 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సముద్రం దగ్గరగా ఉండడంతో ఉప్పు నీరు ఉండవచ్చని అనుమానంతో పరీక్ష కోసం లాబ్‌కు నమూనాలను పంపించామన్నారు. నివేదికలో క్లియరెన్స్ రావడంతో ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి వ్యక్తికీ రోజుకు 135 లీటర్ నీరు అందుతుందన్నారు. మరో రెండు తరాల వరకు తాగునీటి సమస్య ఉండదని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, క్వాలిటీ కంట్రోల్ ఇఇ పి.కామేశ్వరరావు, 1వ వార్డు కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, డిఇ సుధాకర్, ఎఇలు పృథ్వీ, కామేష్ పాల్గొన్నారు.

విత్తనాలను సిద్ధం చేస్తున్న రైతులు

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

ఆమదాలవలస : నవధాన్యాలు సాగుతో నేల సారవంతమవ ుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడ, చేపేనపేట గ్రామాల్లో రైతులతో మంగళవారం నవధాన్య విత్తనాలను పొలాల్లో వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిట్ పరిధిలోని గ్రామాల్లో దాదాపుగా రైతులు అందరితో నవధాన్యాల విత్తనాలను వారి క్షేత్రాల్లో వేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలాగే ఖరీఫ్ సీజనకు ముందు రైతులు ఎంతో ఆసక్తితో ఈ నవధాన్య విత్తనాలు వేయడానికి ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణ అనేది చాలా ఎక్కువ విస్తీర్ణంలో చేపడుతున్నామని తెలిపారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

శివకుమార్ (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఎల్‌సి గేటు సమీపంలో మంగళవారం వేకువజామున పలాస గోరీవీధికి చెందిన ఆలేటి శివ కుమార్ (60) రైలు ఢీకొని మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఆయన రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడక్కడే మృతి చెందారని అన్నారు. మృతుడు గతంలో జీడి పిక్కల వ్యాపారం చేసేవారు. పలాసలో బడ్డీ పోలమ్మ గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలు ముగింపు సమయంలో అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. బంధువులతో ఇల్లు నిండిపోగా... ఆనందంగా గడుపుతున్న సమయంలో శివ కుమార్ మృతి చెందిన వార్త ఒక్కసారిగా కుటుంబ సభ్యులకు కలచివేసింది. మృతదేహాన్ని వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించిన ఘటనా పలువురిని కంటి తడిపెట్టించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్యామల, కుమారులు శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపు వీధిలో కొట్లాట

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

పలాస కాపువీధిలో మంగళవారం రాత్రి జరిగిన కొట్లాటలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారని సిఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒకే వీధికి చెందిన ఇరు గ్రూపుల వారు తమ వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేశారు. బడిపోలమ్మ అమ్మవారి సంబరాల్లో భాగంగా జనం రద్దీ ఎక్కువ కావడంతో వాటిని తొలగించడానికి వారి మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో శివ, ఆయన కుటుంబ సభ్యులు చాక్ తీసుకొని దేవేంద్ర జిన్నా. మణి, దుబ్బ కిషోర్, ప్రవీణ్‌పై దాడి చేశారు. నలుగురు వ్యక్తుల కడుపు, చేయి, నడుం భాగంలో 22 గాయాలయ్యాయి. తీవ్ర రక్తంతో ఉన్న వారిని స్థానికులు గుర్తించి సమీపంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో దేవేంద్రజిన్నా, దుబ్బ కిషోర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సిఐ జి.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకొని సంబరాల కమిటీతో మాట్లాడారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తత జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శివ పరారు కావడంతో పోలీసులు గాలిస్తున్నారు. సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద మంగళవారం అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న లావేరు మండలం పాతకుంకాంకు చెందిన కె.సురేష్‌ను పట్టుకున్నట్లు ఎస్ఇబి ఎన్ని చంద్రమోహన్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద ఉన్న 84 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్ : డివిజన్ కేంద్రంలో ఆర్‌టిసి డిపో సమీపంలో చిన్నారి వెంకటరమణ అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారంతో ఎస్ఐ ఎల్.రామకృష్ణ సోమవారం అర్ధరాత్రి తన సిబ్బంది సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.5 వేలు విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంకట రమణను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టంకాల బాబ్జీ అందరివాడు

రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- నరసన్నపేట

పుస్తకాన్ని అందజేస్తున్న కృష్ణదాస్

టంకాల బాబ్జి అందరివాడని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన బాబ్జి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మరో నిలువెత్తు విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేసి కలెక్టరేట్‌కు పంపించాలని, తాను అనుమతి నిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ బాబ్జీ తమ కుటుంబానికి అత్యంత సన్నిహితులని అన్నారు. ఆయన విగ్రహం సరైన చోట ఏర్పాటు చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు తంగుడు జోగారావు, సుడా చైర్మన్ ప్రతినిధి కోరాద చంద్రభూషణ గుప్త. కుటుంబ సభ్యులు టంకాల గౌతమ్, అర్జున్, ఎంపిపి ఆరంగి మరళి, జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, సర్పంచ్ బూరెల్ల శంకరరావు, నిర్వాహకులు పొట్నూరు నీలం, ఇట్రాజ్ సూరిబాబు. సదాశివుని కృష్ణ పాల్గొన్నారు.

రామారావుకు 'హెల్పింగ్ హేండ్స్' అండ

నగదును అందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

బోన్ కేన్సరుతో బాధపడుతున్న కవిటి మండలం కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావుకు మండలానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన ఆ పాటకు ప్రాణం పోద్దాం కథనానికి స్పందించి రామారావు కుటుంబాన్ని హెల్పింగ్ హేండ్స్ సంఘం సభ్యులు మంగళవారం పరామర్శించారు. రామారావు వైద్యం కోసం తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ దయనీయ పరిస్థితిలో ఉన్న రామారావును దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్, ఉపాధ్యాయుడు లక్ష్మణమూర్తి, హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న ఎంపిపి గోపి

రణస్థలం రూరల్ : కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రవి

చదువే మనిషికి ఆభరణం

ప్రజాశక్తి- జలుమూరు

చదివే మనిషికి ఆభరణమని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. మండలంలోని కరవంజలోని ఆదర్శ పాఠశాల, జలుమూరులోని కేజిబివి పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా కానుక రూపంలో బ్యాగ్‌తో పాటు పుస్తకాలు, షూ, యూనిఫామ్, బెల్టులను పాఠశాల మొదటి రోజునే ఇవ్వడం సంతోషమన్నారు. ప్రతి పేద విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం జగనన్న విద్యా కానుకలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ బమ్మిడి మాధవరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, కెజిబివి ప్రిన్సిపాల్ సిహెచ్. శారదాకుమారి, సర్పంచ్ ప్రతినిధి బాలకృష్ణ, జుత్తు నేతాజీ, పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పథకాలతో పాటు అనుభవం గల ఉపాధ్యాయులతో ఉత్తమైన విద్య బోధిస్తున్నారని తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్ అన్నారు. స్థానిక ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు జెవికె కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందుమతి, స్కూల్ చైర్మన్ పిసిని శంకరరావు, ఉపాధ్యాయులు బెజ్జిపురపు చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఐదేళ్లు గడుస్తున్నా అందని పరిహారం

ఆర్‌డిఒ వద్ద కొజ్జిరియా రైతుల ఆవేదన

వినతిపత్రం అందజేస్తున్న కొజ్జిరియా రైతులు

ప్రజాశక్తి- కవిటి

తామంతా చిన్న, సన్నకారు రైతులమని, సెంటుకు రూ.1,89 లక్షలు ఇస్తామని 2018లో టోల్ గేటు కోసం తమ వద్ద భూములు తీసుకున్నారని, కానీ, ఇంతవరకు ఒక్క రూపాయి చెల్లించలేదని టోల్ గేటుకు భూములిచ్చిన కొజ్జిరియాకు చెందిన రైతులు ఆర్‌డిఒ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల కొజ్జిరియా టోల్‌గేట్ సమీపంలోని పంట పొలాల్లో జరుగుతున్న ఉద్దానం తాగునీటి పథకం పనులను సంబంధిత రైతులు ఇటీవల అడ్డుకున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డిఒ సీతారామ్మూర్తి బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2018 నుంచి అదిగో ఇదిగో అంటున్నారే తప్ప తమకు నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదని వాపోయారు. 2020లో రెవెన్యూ సిబ్బంది సెంటుకు 9,600 విలువ కట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారని అన్నారు. ఏడాదికి రెండు పంటలు పుష్కలంగా పండించే పంట భూములకు ఇది ఏమాత్రం సరిపోదని, ఆ నిర్ణయానికి తాము అంగీకరించలేదని తెలిపారు. గ్రామంలోని కొత్తవాని కృష్ణమ్మ చెరువు ద్వారా తాము ఆ భూముల్లో ఏడాదికి రెండు పంటలు పండిస్తామని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెంటు రూ.60 వేలు ధర పలుకుతోందని రైతులు వివరించారు. మొదట్లో అధికారులు చెప్పినట్టు 1,89,000 కాకుండా తమకు సెంటుకు రూ.60 వేలు ఇస్తేచాలని రైతులు తెలిపారు. వాస్తవ పరిస్థితులు పరిశీలించి ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ రైతుల నిర్ణయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ పి.శేఖర్, డిటి టి.రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి, ఉద్దానం వాటర్ పథకం డిఇ అబ్బుల్ రజాక్ పాల్గొన్నారు.

ఎపిఒను ప్రశ్నిస్తున్న ఎంపిటిసి రాజశేఖర్

'ఉపాధి' మొక్కలు ఏమయ్యాయి?

మండల సమావేశంలో నిలదీసిన ఎంపిటిసి రాజశేఖర్

కోటబొమ్మాళి: ఉపాధి హామీ చట్టం ద్వారా ఏటా రైతుల పొలాల గట్లపై నాటిని మొక్కలు ఏమైపోతున్నాయని, ఇన్ని ఏళ్లుగా నాటిన మొక్కలు ఎక్కడ ఉన్నాయో చూపించగలరా? అని ఎపిఒ ఎం.అరుణ్‌కుమార్‌ను జీయన్నపేట ఎంపిటిసి నంబాళ రాజశేఖర్ ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఏటా కొంతమంది రైతుల పేర్లతో మొక్కలు నాటుతున్నామని మీరు చెబుతున్నారని, వాటిని సంరక్షించే వారు లేక నాటిన కొద్దిరోజులకే చనిపోతున్నాయని అన్నారు. దీంతో ఏటా ప్రభుత్వ ధనం వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిపై ఉందా? లేదా? అని ప్రశ్నించారు. హరిశ్చంద్రపురం ఎంపిటిసి బగాది దివాకర్ మాటఆలుడూత ఉపాధి పనులు ఒక్క చెరువుల్లోనే చేపడుతున్న తప్ప పొలాలకు నీరు వెళ్లే పిల్ల కాలువల్లో పనులు చేపట్టడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు అన్ని రకాల వరి, పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిడిఒ ఎస్.రాజేశ్వరమ్మ, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుక్క రోజా, మండల కో-ఆప్షన్ మెంబరు షేక్ రాజు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మెట్ట సింహాచలం, జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీలో 'జన భగీరథి'

పరిశీలిస్తున్న ధనలక్ష్మి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అంగన్వాడీ చదువు అన్ని దశల్లోనూ ప్రభావితం చూపుతుందని పూండి సెక్టార్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని గోవిందపురం అంగన్వాడీ కేంద్రంలో జన భగీరథి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ మొదటి ఆరేళ్ల పిల్లల జీవితంలో అత్యంత విలువైనవన్నారు. మొదటి మూడేళ్ల తల్లి ఒడికి, ఇంటికి పరిమితమైన పిల్లలు ఆ తర్వాత ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడం మొదలు పెడతారని అన్నారు. ఈ వయసులో చూసిన విన్న వాటి ఆధారంగా వారి బుద్ధి, తెలివితేటలు వికసిస్తాయని తెలిపారు. కానుక పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకిష్టమైన ఆట, పాట, కథలు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారని చెప్పారు. ఈ విద్య ప్రభావం పిల్లల ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ఆర్‌బికె

నిర్మించారు... వదిలేశారు

టెక్కలి: మండలంలోని నర్సింగపల్లి గ్రామ సచివాలయానికి చెందిన రైతు భరోసా కేంద్రం భవనం నిర్మించి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ దానిని ప్రారంభించకపోవడంతో భవనం వృథాగా పడి ఉంది. రూ.23 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. రైతు సేవలోనే ప్రభుత్వమని చెబుతూ రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. ఖరీఫ్ సీజన్‌కి అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు నుంచి ధాన్యం విక్రయం వరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేపడుతుంది. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ భవనం ప్రారంభించకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆర్‌బికె ప్రారంభిస్తే నర్సింగపల్లి, ముఖలింగాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులకు అందుబాటులోకి వస్తుంది. ఈ రెండు పంచాయతీల్లోనూ గిరిజన గ్రామాలు కూడా ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి భవనాన్ని ప్రారంభించకపోవడానికి కారణాలు వైసిపిలోని గ్రూపు తగాదాలేనని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం ఇంత ప్రాధాన్యత తీసుకున్న రైతు భరోసా కేంద్రం నిర్వహణపై ఆ పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులే దృష్టి సారించకపోవడం గమనార్హం. ఈ ఖరీఫ్ సీజన్‌కైనా భవనం అందుబాటులోకి వస్తుందా? లేదా? అని ఈ ప్రాంత రైతులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

తాగునీరు అందించాలని వినతి

కొత్తూరు : మండలంలోని మెట్టూరుగూడ గిరిజన పంచాయతీకి తాగునీరు అందివ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న కోరారు. ఈ మేరకు మెట్టూరు సచివాలయం అధికారులను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రెండేళ్ల క్రితం ట్యాంకును నిర్మించి కుళాయి పాయింట్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. వేసవి దృష్ట్యా నీరు అడుగంటిపోవడంతో సక్రమంగా నీరు రావడం లేదని, దీంతో ట్యాంకు నిండడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈయనతో పాటు సవర చంద్రకళ, గౌరమ్మ, పద్మ, సబ్బలక్ష్మి, లక్ష్మి ఉన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అక్రమార్జనపరుల నోట పేదల కోసమే పనిచేస్తున్నామని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి నిరంతరాయంగా చెప్పిందే చెప్పి అదే నిజమని నమ్మించే ప్రయత్నం వైసిపి నాయకులు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. తరతరాలు తన పిల్లలకు తరగని ఆస్తులను కూడబెట్టి పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నామని చెప్పడం వింత గొలుపుతోందన్నారు. అటువంటి వారి గురించి ప్రజలు ఆలోచించాలని, వారి మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలు హితవు పలికారు.

బిలాయ్‌తో ఉద్దానానికి విడదీయరాని బంధం

బిలాయ్ నగర్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్

ప్రజాశక్తి- పలాస

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయ్ ప్రాంతంతో జిల్లాలోని ఉద్దాన ప్రాంతానికి దశాబ్దాల కాలంగా విడదీయరాని బంధం ఉందని బిలాయ్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్ పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామంలో నిర్వహిస్తున్న సంబరాల్లో మంగళవారం పాల్గొన్నారు. అంతకుముందు కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్దాన ప్రాంతంలో మొట్టమొదటిసారిగా పర్యటించానని, ఈ పర్యటన ఎంతో అనుభూతిని ఇచ్చిందని అన్నారు. తీర ప్రాంతంలో మత్స్యకారులతో మాట్లాడిన సందర్భాలను వివరించారు. ఉద్దాన ప్రాంతంలో రైతుల శ్రమ చాలా విలువైందన్నారు. వారి కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలన్నారు. ఈ ప్రాంత చైతన్య ఉద్యమ చరిత్ర తెలుసుకున్నానని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పలాస ప్రాంతం నుంచి బిలాయ్ ప్రాంతం దుర్గ్‌కు ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఉద్దాన ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. అనంతరం మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆయన స్వగ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరు ప్రాంతాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామని మాట్లాడుకున్నారు. ఈయన వెంట బిలాయి కార్పొరేటర్ లక్ష్మీపతిరాజు, అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు, కాశీబుగ్గ సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ్ కామేశ్వరరావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లండ చైతన్య, ఎపి అగ్రికల్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రవి, దాసరి నాగమణి, డి.రమణ, కొల్లా రాజు, మాజీ కార్పొరేటర్ రాజు, ఉద్దాన ప్రాంత మేధావుల ఫోరం అధ్యక్షులు లండ రుద్రమూర్తి, కొండపు వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిలాయ్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లిలో నిర్వహిస్తున్న అంబికాదేవి గ్రామ దేవత ఉత్సవాల్లో బిలాయ్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్ పాల్గొన్నారు. గ్రామస్తులతో ముచ్చటించి హుషారుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ కౌన్సిలర్ అంబటి ఆనంద్, వైసిపి నాయకులు మల్లా శ్రీనివాసరావు, గ్రామస్తులు సింగుపల్లి ధనుంజయ్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న తిలక్, వాణి

రాజగోపాలరావు విగ్రహానికి స్థల పరిశీలన

టెక్కలి రూరల్ : మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు టెక్కలి ఆదిఆంధ్ర కాంప్లెక్స్ సమీపంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జెడ్‌పిటిసి దువ్వాడ వాణిలు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ వారు మాట్లాడుతూ రాజగోపాలరావు ఎంపీగా ఆరుసార్లు ఎన్నికై జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, సత్తారు సత్యం, ఆట్ల రాహుల్, గుజ్జు మోహన్‌రెడ్డి, మెర్రి శంకర్, నాగళ్ల శంకర్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర స్పోర్ట్స్ అథారటీ ఆధ్వర్యాన కడప జిల్లాలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్లో 4,5 తరగతుల్లో చేరేందుకు బాలబాలికల ఎంపిక ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులు 2014 ఆగస్టు 1 నుంచి 2015 జులై 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. విద్యార్థుల స్టడీ, ఆధార్, జనన ధ్రువపత్రాల ఒరిజినల్ నకళ్లతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్.రవి 9866098642 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఇటీవల సిఎం జగన్మోహన్‌రెడ్డి సర్వీస్‌ను క్రమబద్ధీకరణకు నిర్ణయించారు. ఈ మేరకు రణస్థలం, లావేరు మండలాల వైద్యారోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు మండలాల వైద్య ఆరోగ్యశాఖ యూనియన్ నాయకులు గురాన చిరంజీవి, డి.సాయిప్రసాద్, ఎస్.గోవిందరావు, సిహెచ్.చిన్నబాబు, ఎస్.అప్పలరాజు, డి.హరిప్రసాద్, పి.మన్మథరావు, ఎం.రాజమోహన్ ఆచారి పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎడి విజయభాస్కర్

వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

వరి విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా పరిసరాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి డి.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లిలో ఆర్‌బికెలో వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీకి రూ.పది చొప్పున 30 కేజీలకు రూ.300 పోను రూ.834కు విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, 1బి జిరాక్స్‌లు, ఫోన్ నంబరును తీసుకుని ఆర్‌బికెలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేట మూడో వార్డులో నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్ పి.తవిటయ్య ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు సాలీన ఢిల్లీ యాదవ్, ఆసి లీలారాణి, కళ్ల దిలీప్ కుమార్, నారాయణ బెహరా, నందికి జాని, కొండ శంకర్‌రెడ్డి, రెయ్య జానికిరావు, గాలి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

పొందూరు: మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హత ప్రామాణికంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరుతుందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, ఎంపిటిసి వడగ పార్వతి, సర్పంచ్ ప్రతినిధి కిల్లాన భాస్కరరావు పాల్గొన్నారు.

జలుమూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని చల్లవానిపేట పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ... ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి సిఇసి మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపిపి వాన గోపి, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దామ మన్మథరావు, ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు పాల్గొన్నారు.

జలుమూరు: పోస్టర్‌ను అందజేస్తున్న కృష్ణదాస్

నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి ప్రభుత్వ హయాంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా చేతివృత్తులతో పాటు ఏదైనా వ్యాపారాలు చేసుకునేందుకు రూ.లక్ష సబ్సిడీతో రుణాలు ఇచ్చారని, కానీ, వైసిపి ప్రభుత్వం 38 వేల మందికి ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. నగరంలోని రెవెన్యూ విశ్రాంత భవనంలో కుప్పిలి మోహనరావు అధ్యక్షతన జిల్లా నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపిడి ఇస్తున్న రూ.10వేలు సాయానికి స్ట్రీట్ వెండరుగా నమోదు చేసుకోవాలని చెప్పి చేతివృత్తి కి దూరం చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ వైద్యం శాంతారాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లేశ్వరరావు, జమ్ము రవి, గొరింట శ్రీను, భాస్కరరావు, నర్సింహులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కోటబొమ్మాళి : స్థానిక టిడిపి కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సాధికారత సమితి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వైద్యం శాంతారావు, టిడిపి క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ గుంటిపల్లి నాగేశ్వరరావు, పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్ కుప్పిలి వెంకటరావు, మల్లేశ్వరరావు, పట్నాన భాస్కరరావు పాల్గొన్నారు.

ఫణశ్యామ్‌కు అభినందనలు

పలాస : ఇటీవల విడుదలైన ఎపిఆర్‌జెసి ఫలితాల్లో కాశీబుగ్గ ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన కంసు ఫణశ్యామ్ స్టేట్ 15వ ర్యాంకు సాధించాడని ప్రిన్సిపాల్ డి.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో మంగళవారం ఫణశ్యామ్‌కు మంగళ వారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ ఎంపిసిలో వెయ్యికి 924 మార్కులు సాధించాడని అన్నారు. డిగ్రీలో బిఎస్‌సి చేరేందుకు ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలు రాసి రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖగేశ్వరరావు, అకాడమిక్ అడ్వయిజర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

వర్షాధార ప్రాంతాల్లో ఆరుతడి విధానం లాభదాయకం

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు

అవగాహన కల్పిస్తున్న హరిబాబు

ప్రజాశక్తి- రణస్థలం

వరినాట్లు సకాలంలో వేసినప్పుడే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన రణస్థలం, లావేరు మండలాల్లో వివిధ గ్రామాల్లో ఎరువులు, విత్తనం ఒకేసారి వేసే ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో చేపడుతున్న క్షేత్ర ప్రదర్శనలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగును యంత్రాలతో చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు.

యంత్రాల వినియోగం వల్ల ఖర్చు ఆదా అవుతుందని అన్నారు. ఎకరాకు 16 కిలోల శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా దమ్ము చేసిన పొలంలో ట్రాక్టర్‌తో నడిచే ఎరువులు, విత్తనం ఒకేసారి ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్‌తో వేసుకోవచ్చన్నారు. విత్తనాన్ని ఎక్కువ లోతులో వేసినట్లయితే మొలక శాతం దెబ్బతినే అవకాశం ఉందని, కనుక నేలపై పొరల్లో పడేటట్లుగా అంటే సుమారు 2.5 నుంచి 5 సెం.మీ లోతులో విత్తనం పడేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ పద్ధతిలో నీరు నిల్వ గట్టడం ఉండదన్నారు. సకాలంలో కలుపు నివారణ, సమగ్ర నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఆర్.కృష్ణ, ఎం.గణేష్ పాల్గొన్నారు.

పశు బీమాతో పాడి రైతుకు ధీమా

ప్రజాశక్తి- జలుమూరు

పశు బీమాతో పాడి రైతులకు ధీమా లభిస్తుందని పశువైద్యశాఖ డిడి డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. మండలంలోని లింగాలవలసలో పాడి రైతులకు పశు బీమాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ పశు నష్టపరిహార పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు పాడి రైతులకు రక్షణ లభిస్తుందన్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు మృతి చెందితే పశుపోషకులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎడి ఎం.లోకనాథం, జలుమూరు, అచ్యుతాపురం పశు వైద్యాధికారులు ముద్దాడ దీప్తి, పట్ట సంతోష్‌కుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జయరాజ్

ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న వార్డు కౌన్సిలర్ చిదిపాతి జగన్నాయకులు తండ్రి జోగయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మంగళవారం సంతాపసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్ని జోగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, సిడాప్ చైర్మన్ సాధ్ది శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి ప్రతినిధి కారింగి మోహనరావు, వార్డు కౌన్సిలర్లు బచ్చు జగన్, ప్రేమ్‌కుమార్, ప్రకాశరావు, పట్నాయక్ పాల్గొన్నారు.

19 నుంచి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని అన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరి

ఇచ్ఛాపురం : ప్రయివేటు స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరని, బస్సులకు ఉన్న డ్రైవర్లు మాత్రమే ఉండాలని ఇచ్ఛాపురం రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల ఆఖరులోగా స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేయించుకోవాలన్నారు. లేకుంటే స్కూల్ బస్సులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని ధ్రువపత్రాలూ సక్రమంగా ఉండాలన్నారు.

'బెహరా మనోవికాస'లో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్ పౌండేషన్ సభ్యులు జాడ శ్రీదేవి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డిపిఆర్‌ఒ బాలమాన్ సింగ్ పాల్గొని శ్రీదేవి చిత్రపటానికి పూమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం కుమారుడు సాయి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మనిషా, అవినాష్, జిల్ ఫౌండేషన్ ప్రతినిధి సత్యసాయి, పొడుగు చరణ్, రౌతు సుప్రజ, శివప్రసాద్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పారావు

సచివాలయం ఆకస్మిక తనిఖీ

జలుమూరు: మండలం లోని సుబ్రమణ్యపురం సచివాలయాన్ని ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయానికి వివిధ పనులపై వచ్చే అర్జీదారులపై స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో లబ్ధిదారులకు సేవలు అందించాలని సూచించారు. సర్పంచ్ కూన వెంకటరమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

ఆమదాలవలస : పట్టణంలోని పోస్టాఫీసు వద్ద నేతాజీ యూత్ ఆధ్వర్యాన మంగళవారం ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. వివిధ పనులపై తహశీల్దార్, సబ్ రిజిస్టర్, పోస్టాఫీసు కార్యాలయాలకు వచ్చిన వెయ్యి మంది బాటసారులకు మజ్జిగను సీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు చిగురుపల్లి చిన్ను మాట్లాడుతూ పేడాడ రామ్మోహన్ సౌజన్యంతో వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నందున ఈ మజ్జిగ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈరోజు కార్యక్రమానికి అయ్యే ఖర్చును పేడాడ రామ్మోహన్ భరించారని తెలిపారు. కార్యక్రమంలో సువ్వారి గాంధీ యూత్ సభ్యులు బగాది నేతాజీ, గురుగుబెల్లి రాజశేఖర్, దాలినాయుడు, సాయి, సుబ్బు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని చాపర పరమహంస వీధి ముత్యాల పోలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం అమ్మవారిని దర్శించుకుని రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వం నుంచి గ్రామంలో గ్రామ దేవతలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మెంబర్లు శ్రీరామ్, ప్రకాష్, ఎం.కృష్ణ, మోహన్, తేజ, సింహాచలం, బి.మధు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన గొరినాయుడు

రణస్థలం : తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు విజయసాయిరెడ్డి అధ్యక్షతన వైసిపి సేవాదళ్, జోనల్ ఇన్‌ఛార్జులు, జిల్లా అధ్యక్షులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రణస్థలం మండల కేంద్రానికి చెందిన మూడు జిల్లాల వైసిపి సేవాదళ్ రీజనల్ కో-ఆర్డినేటర్ పిన్నింటి గొరినాయుడు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.